క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు..

సనత్‌నగర్: టమాటా కిలో రూ.15, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 11, క్యారెట్ 15, దొండ 35, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 55, గోకరకాయ 45, కీర 13, దోసకాయ 28, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 145 ఆలుగడ్డ 18, చామగడ్డ 55, మొరంగడ్డ 15, కందగడ్డ 35, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 10, మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఘనంగా సాయిబాబా జయంత్యుత్సవాలు



సాయిబాబా జయంత్యుత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ దీపిక

రాంగోపాల్‌పేట్: రెజిమెంటల్ బజార్‌లోని బాల గణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాయిబాబా జయంత్యుత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామివారికి ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున స్థానిక భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోండా మార్కెట్ డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక పూజల్లో పాల్గొన్నారు.

ఓయూలో విద్యార్థుల నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌పీఎస్సీ అక్రమాలపై శాంతియుతంగా ఆందోళనలు చేపట్టిన కాకతీయ యూనివర్సిటీ విద్యార్థుల అరెస్ట్‌ను వ్యతిరేకిస్తూ ఓయూ విద్యార్థులు నిరసన తెలిపారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట బహుజన్ స్టూడెంట్స్ ఫెడరేషన్ అధ్యక్షులు వేల్పుల సంజయ్, ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కేయూ విద్యార్థుల అరెస్ట్ అప్రజాస్వామికమని, 30 లక్షల నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిన టీఎస్‌పీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

మే 30న ఢిల్లీలో ధర్నా



మాట్లాడుతున్న సీపీఐ నేత సాంబశివరావు

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రజా సమస్యలు, దళితులపై దాడులు తదితరాలను నిరసిస్తూ మే 30న ఢిల్లీలో ధర్నా నిర్వహిస్తామని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం ఓయూ క్యాంపస్ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ప్రథమ మహాసభ జరిగింది. కార్యక్రమానికి డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు యేసురత్నం అధ్యక్షత వహించగా సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఆల్ ఇండియా దళిత్ రైట్స్ ఫోరం జాతీయ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రాంమూర్తి, బాల మల్లేష్ తదితరులు ప్రసంగించారు. మే 30న ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు, రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రాహుల్‌గాంధీపై అనర్హత వేటు నిరంకుశానికి నిదర్శనం

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పై అనర్హత వేటు కేంద్ర ప్రభుత్వ నిరంకుశానికి నిదర్శనమని పలువురు ఓయూ ప్రొఫెసర్లు పేర్కొన్నారు. శనివారం ఓయూ గెస్ట్‌హౌస్‌లో రీసెర్చ్ స్కాలర్ ఆధ్వర్యంలో రాహుల్ బహిష్కరణ పై బిగ్ డిస్కషన్ జరిగింది. కార్యక్రమానికి పీడీఎస్‌యూ విద్యార్థి నాగేశ్వర్‌రావు అధ్యక్షత వహించగా ఓయూ ప్రొఫెసర్లు గాలి వినోద్‌కుమార్, మహ్మద్ అన్సారీ, ప్రొ.చంద్రునాయక్, కాంగ్రెస్ నేత మానవతరాయ్, ఓయూ జేఏసీ నేత శరత్‌నాయక్, వామపక్ష విద్యార్థి నాయకులు పాల్గొని ప్రసంగించారు.

బార్ అసోసియేషన్ లేబర్ కోర్టు అధ్యక్షుడిగా కె. రఘురాంరెడ్డి

చిక్కడపల్లి: బార్ అసోసియేషన్ లేబర్ కోర్టు నూతన అధ్యక్షుడిగా కె.రఘురాంరెడ్డి ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో ఎ.తిరుపతిరెడ్డిపై రఘురాంరెడ్డి ఘన విజయం సాధించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా డి.విలాస్, జీవీఎస్ గణేష్, వంచ తిరుపతిరెడ్డి, కార్యదర్శి ఎం.మధుసూదన్, కోశాధికారిగా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా కిరణ్‌కుమార్, లైబ్రేరియన్‌గా అంబుజామానె, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా వై.రంజిత్‌రెడ్డి, ప్రతాప్ లింగంగౌడ్, మహిళా ప్రతినిధిగా రవియాబేగం, కార్యవర్గ సభ్యులుగా రమేష్, డి.సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సీహెచ్ లక్ష్మీనారాయణ వ్యవహరించారు.

ఎఫ్ఓబీల నిర్వహణ గాలికి

- పాదచారుల అవస్థలు
- పనిచేయని ఎస్కలేటర్లు, లిఫ్టులు..
- వృద్ధులు, మహిళల ఇబ్బందులు..
- అమీర్‌పేటలో ఎఫ్ఓబీ కథ కంచికేనా..!



ఎస్కలేటర్, లిఫ్టులు పనిచేయకుండా ఉన్న మోడల్‌కాలనీ కమాన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి

సనత్‌నగర్: మహానగరంలో ఒకదాని వెనుక మరొకటి రయ్‌మంటూ దూసుకువచ్చే వాహనాలను తప్పించుకుని రోడ్డుదాటాలంటే హడలెత్తిపోవాల్సిందే. ఎత్తైన మెట్రో డివైడర్లు కారణంగా ఎక్కడపడితే అక్కడ రోడ్డు దాటే పరిస్థితులు లేవు. ఈ క్రమంలో అపసోపాలు పడుతూ సుదూర ప్రాంతాల్లోని యూటర్న్‌ల వద్దకు వెళితే..అక్కడ కూడా లెక్కకు మిక్కిలిగా వచ్చే వాహనాలను తప్పించబోయి ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు కోకొల్లలు. అయితే రోడ్డు దాటే పాదచారుల అవస్థలకు చెక్ పెట్టేందుకు ఫుడ్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్ఓబీ)ల నిర్మాణాలను జీహెచ్ఎంసీ చేపట్టింది. నిర్మాణంతోనే పని అయిపోయిందని చేతులెత్తేస్తూ వాటి నిర్వహణను మాత్రం గాలికొదిలేస్తున్నారు. ఫలితంగా ఎఫ్ఓబీల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ముఖ్యంగా మోడల్‌కాలనీ కమాన్ వద్ద , బేగంపేట హెచ్‌పీఎస్ ఎదురుగా నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్వహణ లోపం కారణంగా రోడ్డు దాటే పాదచారులకు అవస్థలు తప్పడం లేదు. ఎఫ్ఓబీల లక్ష్యం నెరవేరడం లేదు. ఇక వ్యాపార, వాణిజ్య రంగాలకు పెట్టింది పేరైన అమీర్‌పేటలో ఎప్పుడో ప్రారంభమైన ఎఫ్ఓబీ కథ కంచికే చేరిందని చెప్పాలి. కనీసం దీనిపై అధికారులు దృష్టిసారించకపోవడంతో ఇక్కడ రోడ్డు దాటే పాదచారుల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.

మోడల్‌కాలనీ వద్ద పనిచేయని ఎస్కలేటర్లు, లిఫ్టులు..



అమీర్‌పేట వద్ద అర్ధాంతరంగా ఆగిపోయిన ఎఫ్ఓబీ

మోడల్‌కాలనీ కమాన్ వద్ద దాదాపు మూడేళ్ళపాటు కొనసాగించి ఎట్టకేలకు పూర్తి చేసి ప్రారంభించిన ఎఫ్ఓబీ నిర్వహణ అటకెక్కింది. ప్రారంభించిన కొన్నాళ్లకే ఇక్కడ ఎస్కలేటర్లు, లిఫ్టులు పనిచేయకపోవడంతో ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, పసి పిల్లలు ఉన్న తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. ఎర్రగడ్డ రైతుబజార్, చర్చి, రాష్ట్రస్థాయి ఆస్పత్రులతో పాటు ఇరువైపులా ఉన్న పలు కాలనీల ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా కోట్లాది రూపాయలతో ఇక్కడ ఎఫ్ఓబీని నిర్మించారు. ఎస్కలేటర్లు, లిఫ్టులు పనిచేయనప్పుడు కోట్లు వెచ్చించి ఎందుకు నిర్మించారని పలువురు వాపోతున్నారు.

బేగంపేటలోనూ ఇదే పరిస్థితి

బేగంపేట హెచ్‌పీఎస్ వద్ద గత నాలుగేళ్ల క్రితం ఏర్పాటుచేసిన ఎఫ్ఓబీ లిఫ్ట్ పనిచేయడం లేదు. బేగంపేట మహిళా డిగ్రీ కళాశాల, హెచ్‌పీఎస్, మహర్షి విద్యాలయ సంస్థలతో పాటు మయూరి మార్గ్, అల్లంతోటబావి, శ్యాంలాల్ బిల్డింగ్స్ ప్రాంత నివాసితులు రోడ్డు దాటేందుకు వీలుగా ఈ ప్రాంతంలో ఎఫ్ఓబీ ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే లిఫ్ట్ పనిచేయకపోవడంతో ఎత్తైన బ్రిడ్జిని ఎక్కాలంటే వృద్ధులు, మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు.

కదలిక లేని అమీర్‌పేట ఎఫ్ఓబీ..



పనిచేయని బేగంపేట ఎఫ్ఓబీ లిఫ్ట్

అమీర్‌పేట చర్మాస్ వద్ద గత ఐదేళ్ల క్రితం తలపెట్టిన ఎఫ్ఓబీ నిర్మాణం ఆదిలోనే ఆగిపోయింది. ఓ దుకాణ యజమాని న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఇక్కడి ఎఫ్ఓబీ నిర్మాణ పనులు ఆగిపోయాయి. అప్పటి నుంచి దీనిపై కనీసం ధ్యాస కూడా పెట్టడం లేదు. అత్యంత రద్దీగా ఉండే అమీర్‌పేట ప్రాంతంలో రోడ్డు దాటాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్ళాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో పాదచారులు రోడ్డు దాటేందుకు ఎఫ్ఓబీ అవసరం చాలా ఉంది. దీనిపై అధికారులు దృష్టిసారించాల్సిందిపోయి ఆ వైపుగా ఆలోచన కూడా చేయడం లేదు. సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు ఫుట్ ఓవర్ల నిర్వహణపై దృష్టిసారించి అమీర్‌పేటలో ఫుట్ ఓవర్ నిర్మాణానికై ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని పాదచారులు కోరుతున్నారు.

నీటిపొదుపు పౌరుల బాధ్యతగా భావించాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జలమండలి డీజీఎం కృష్ణ

సికింద్రాబాద్: నీటిని పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు, భూగర్భ జలాల పరిరక్షణకు పౌరులంతా విధిగా పాటుపడాలని జలమండలి మారేడుపల్లి డివిజన్ డీజీఎం వై.కృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావిలోని శ్రీసాయి విద్యాలయ ఆడిటోరియంలో ప్రపంచ నీటి దినోత్సవ వేడుకలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ సామల హేమ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డీజీఎం కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటిని నగరానికి అందించడంలో ప్రభుత్వ పరంగా జరుగుతున్న కృషి వ్యయప్రయాలను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వివరించారు. సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్ల కార్పోరేటర్‌లు సామల హేమ, కంది శైలజ మాట్లాడుతూ నీటిపొదుపు ద్వారా జరిగే లాభాలను వివరించారు.

బౌద్ధనగర్: ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని బౌద్ధనగర్‌లో సాయి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులకు నీటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కంది శైలజ మాట్లాడుతూ నీటి వృథా చేయకుండా తగినంత వాడుకోవాలని సూచించారు. నీటి ఎద్దడి నివారణకై రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు.

చిన్నారుల ఆరోగ్యానికి ప్రాధాన్యం



పోషన్ పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రసూల్‌పురా: రక్తహీనత. బరువు, పౌష్టికాహార లోపాలను నివారించి చిన్నారుల ఆరోగ్యానికి ప్రాధాన్యతిస్తూ ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమలు చేపట్టడం అభినందనీయమని మార్కెట్ మాజీ చైర్మన్ టిఎన్. శ్రీనివాస్ అన్నారు. కంటోన్మెంట్ బోర్డు తిరుమలగిరి సెక్టార్ పరిధిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషన్ పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మనగర్‌లో పాఠశాల విద్యార్థులతో కలసి శుక్రవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో శ్రీనివాస్ పాల్గొన్నారు.

రసూల్‌పురా: పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ మోదీ పరిపాలన విధానంపై నిజాలను మాట్లాడినందుకు తట్టుకోలేక రాజకీయ కక్షతో ఆయనపై అనర్హత వేటు వేశారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఫిరోజ్‌ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్యారసాని రామ్‌కుమార్ ఆధ్వర్యంలో రాహుల్‌పై అనర్హత వేసిందుకు నిరసనగా జేబీఎస్ పీజేఆర్ విగ్రహం సమీపంలో పార్టీ నేతలు శుక్రవారం సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు.

నీటి వృథాను అరికట్టాలి : డిప్యూటీ మేయర్



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

లాలాపేట: నీటి వనరుల సంరక్షణ అందరి బాధ్యత అని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఈ నెల 21 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ నీటి దినోత్సవ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా తార్నాకలోని డిప్యూటీ మేయర్ కార్యాలయం వద్ద జలమండలి, స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యతిథిగా పాల్గొని మాట్లాడారు. నీటి వృథాను అరికట్టే పద్ధతులను తెలిపేలా ప్లకార్డులను ప్రదర్శించారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

సనత్‌నగర్: ప్రజావసరాలను తెలుసుకుని వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నట్లు బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి అన్నారు. డివిజన్ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో పర్యటించిన ఆమె స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ల సామర్థ్యం ప్రస్తుత జనాభా అవసరాలకు సరిపోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కార్పొరేటర్‌కు వివరించారు. దీంతో కొత్త పైప్‌లైన్ల నిర్మాణం జరిపేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కోరారు.



ప్రకాష్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



లాలాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

లాలాపేట: చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని సికింద్రాబాద్ ప్రాజెక్టు ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఏ. రేణుక అన్నారు. ఈ మేరకు శుక్రవారం లాలాపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాల(మార్కెట్ స్కూల్)లో పోషణ పక్షోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరు ధాన్యాలైన సజ్జలు, రాగులు, కొర్రలు, ఆండు కొర్రలు, సామలు, ఊదలతో తయారు చేసిన ఆహార పదార్థాలను ఈ సందర్భంగా ప్రదర్శించారు.



సీతాఫల్‌మండి ప్రభుత్వ పాఠశాలలో...

చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం చిరుధ్యాన్యాల పట్ల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిరు ధాన్యాలు అనగా ఏమిటి.. ఎన్ని రకాలు ఉంటాయి... వాటిని ఆహారపదార్థాలుగా మార్చుకోవడం ద్వారా చేకూరే లాభాల పట్ల విద్యార్థులకు ప్రయోగాత్మకంగా అవగాహన కలిగించారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

అమీర్‌పేట: రాజ్యాంగ బద్ధంగా వచ్చిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని అమీర్‌పేట తహసీల్దార్ విష్ణుసాగర్ తెలిపారు. సివిల్స్ రైట్స్ డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో హక్కులపై అవగాహన కల్పించారు. ప్రతి పౌరుడు భారత రాజ్యాంగం పుస్తకాలను చదువుకుని,వారికున్న హక్కులను కాపాడుకోవాల్సిన అవసరముందని అన్నారు.

కంటోన్మెంట్ ఉద్యోగానికి పరుశరామ్ స్వస్తి

- ప్రత్యక్ష రాజకీయాల్లోకి వెళ్లనున్న ఉద్యోగ సంఘం నేత
- అర్జున్ రావు, ఏనుగు రవీందర్ రెడ్డిల బాటలోనే..

కంటోన్మెంట్: కంటోన్మెంట్ సీనియర్ అసిస్టెంట్, ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి ఆరె పరుశరామ్ స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నారు. రాజకీయాల్లో చేరాలన్న ఆలోచనలతో కొన్నాళ్లుగా క్షేత్రస్థాయిలో తనవంతు ప్రయత్నాలు చేస్తూ వచ్చిన ఆయన గత నెలలోనే ఉద్యోగానికి రాజీనామా చేయగా, రక్షణ శాఖ ఉన్నతాధికారులు ఆమోదించారు. దీంతో శుక్రవారం ఆయన పదవీ విరమణ పొందారు. ఆయన త్వరలోనే బీజేపీలో చేరే అవకాశముందని తెలుస్తోంది. ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నారు. 2000 మార్చిలో ఉద్యోగంలో చేరిన పరుశరామ్ పదేళ్లలోనే కంటోన్మెంట్ ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శిగా కీలక బాధ్యతలు చేపట్టారు.



బట్టలబజార్‌లో కార్మికులకు ఆరోగ్య శిబిరం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బట్టల బజార్‌లో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. బట్టలబజార్‌లో పనిచేసే, కార్మికులు, సిబ్బంది తదితరుల కోసం ఉచితంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చీర శ్రీకాంత్ హాజరయ్యారు.



డాక్టర్ హన్మంతరావుకు సత్కారం



రాంగోపాల్‌పేట్: ఇటీవల రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును అందుకున్న డాక్టర్ హన్మంతరావును రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్, బీజేపీ నాయకులు చీర శ్రీకాంత్‌లు ఘనంగా సత్కరించారు. శుక్రవారం మారేడుపల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి ఆయనను పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు.

బీజేపీకి రాహుల్ భయం పట్టుకుంది



సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న ఫిరోజ్ ఖాన్

కంటోన్మెంట్: ప్రధాని నరేంద్ర మోడీకి రాహుల్ గాంధీ భయం పట్టుకుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ ఖాన్ అన్నారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వ రద్దును నిరసిస్తూ కంటోన్మెంట్‌లో సీనియర్ కాంగ్రెస్ నేత ప్యారసాని రామ్‌కుమార్ ఆధ్వర్యంలో జేబీఎస్ చౌరస్తా వద్ద సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఫిరోజ్ ఖాన్ భారత్ జోడో యాత్రతతో రాహుల్ గాంధీ బీజేపీకి ఓ చాలెంజర్‌లా మారాడని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బొల్లు కిషన్, డీబీ దేవేందర్, పీసీసీ కార్యదర్శి బల్వంత్ రెడ్డి పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

రసూల్‌పురా: మడ్‌ఫోర్ట్ శ్రీరామనగర్‌లో నెలకొని ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని బీఆర్ఎస్ నాయకులు శ్రీ గణేష్ హామీచ్చారు. శుక్రవారం శ్రీరామ నగర్‌లో శ్రీ గణేష్ పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారికి పెన్షన్లు రావడం లేదని. వీధి దీపాలు, పవర్‌బోర్‌వెల్ ఏర్పాటు, డ్రైనేజీ సమస్య, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. అదేవిధంగా మహిళల ఉపాధి, మహిళా భవన్ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీ గణేష్ మాట్లాడుతూ శ్రీ గణేష్ ఫౌండేషన్ తరపున మహిళల కోసం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.



రామలింగేశ్వర ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న శ్రీ గణేష్

అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న...

రసూల్‌పురా జగదీశ్‌నగర్ కాలనీలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో బిఆర్ఎస్ నాయకులు శ్రీ గణేష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం శుక్రవారం జరిగింది.

సంస్కృతం అన్ని భాషలకూ మూలం



మాట్లాడుతున్న సీఈవో మధుకర్ నాయక్

రసూల్‌పురా: సంస్కృత భాష అన్ని భాషలకు మూలమని ఆ భాషను విద్యార్థులు అంకిత భావంతో నేర్చుకుంటున్నారని కంటోన్మెంట్ బోర్డు సీఈవో దీరావత్ మధుకర్ నాయక్ అన్నారు. న్యూ బోయిన్‌పల్లి ఓల్డ్ ఎయిర్‌పోర్ట్ రోడ్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర వేదాంత వర్ధిని సంస్కృత కళాశాల, పాఠశాల 95 వ వార్షికోత్సవం కళాశాల ప్రధానాచార్యులు బానోత్ సురేందర్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన మధుకర్ నాయక్ సంస్కృత భాష ఔన్యాత్యాన్ని కొనియాడారు. తన చిన్ననాటి పాఠశాల, కళశాల నాటి సంగతులను గుర్తు చేశారు.

ఫిజికల్ డైరెక్టర్ పదవీ విరమణ



రవికుమార్‌ను సత్కరిస్తున్న బిజేపీ నాయకులు మద్దెర్ల శ్యాంసుందర్

అడ్డగుట్ట: నార్త్‌లాలాగూడలోని రైల్వే బాయ్స్ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన రవికుమార్ శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ మేరకు తార్నాకలోని రైల్వే జూనియర్ కాలేజీలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మద్దెర్ల శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

వర్గల్ దేవాలయం ఫౌండర్ చైర్మన్‌కు సత్కారం



యాయవరం చంద్రశేఖర సిద్ధాంతిని సత్కరిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: వర్గల్‌లోని విద్యా సరస్వతి శనైశ్వర దేవాలయానికి ఫుడ్ సేఫ్టీ స్టాండర్స్ అథారిటీ భోగ్ సర్టిఫికేట్‌ను అందించడం పట్ల ఆలయ ఫౌండర్ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతిని పలవువురు ఘనంగా సన్మానించారు. శుక్రవారం సోమసుందరం వీధిలోని ఆయన కార్యాలయంలో దేవదాయ శాఖ ఈఈ దుర్గాప్రసాద్, భక్తులు దయానంద్‌రావు తదితరులు కలిసి చంద్రశేఖర సిద్ధాంతిని సత్కరించారు. తెలంగాన వ్యాప్తంగా 70 దేవాలయాలు ఈ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోగా యాదగిరిగుట్ట నరసింహ స్వామి దేవాలయం, వర్గల్ విద్య సరస్వతి దేవి శనైశ్వర ఆలయానికి ఈ సర్టిఫికేట్ లభించిందని అన్నారు.

పదవతరగతి విద్యార్థులకు ఎగ్జామ్ కిట్స్ పంపిణీ



సికింద్రాబాద్: పదవతరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న సీతాఫల్‌మండి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ప్యాడులు, పెన్నులు తదితర స్టేషనరీని పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జీహెచ్ఎంసీ సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్ల కార్పోరేటర్‌లు సామల హేమ, కంది శైలజ హాజరయ్యారు.

ఆడ పిల్లలకు కరాటే శిక్షణ అవసరం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సమాజంలో రోజు రోజుకు ఆడపిల్లలపై అత్యాచారాలు, హింస పెరుగుతున్న కారణంగా వారికి రక్షణగా కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని ఐద్వా కార్యాలయంలో వీరనారి ఐలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కరాటే శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టేందుకు ఎన్నో చట్టాలు, షీటీమ్‌లను ఏర్పాటు చేసిన హింస పెరుగుతూనే ఉందన్నారు. పెట్టుబడిదారి సమాజం ఆడపిల్లలను అంగడి సరుకుగా చూపించడం వల్లనే ఆడపిల్లలపై హింస పెరుగుతుందన్నారు. ఆడపిల్లల ఆత్మ రక్షణకు కరాటే లాంటి శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వీరనారి ఐలమ్మ ట్రస్ట్ చైర్మన్ బుగ్గవీటి సరళ, ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అరుణజ్యోతి, మల్లులక్ష్మీ, ఉపాధ్యాయులు జ్యోతి, ట్రస్ట్ కార్యదర్శి హైమావతి, కె.ఎస్.ఆశలత, ఇందిరా, శశికళ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి

ముషీరాబాద్: రబీ సీజన్‌లో అన్ని రకాల పంటలను తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాయల చంద్రశేఖర్, కె.రంగారెడ్డిలు అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని మార్క్స్ భవన్‌లో శుక్రవారం నిర్వహించగా.. వారు హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నారన్నారు. వారు ప్రజలు, రైతులకు చేసిందేమి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామన్నారని చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చి 8 ఏళ్లు గడిచినా రైతులకు ఎలాంటి లాభం చేకూరలేదన్నారు.